**కథ** డా. పేరాల శ్రవణ్‌కుమార్

**రోజూ ఉద్యోగరీత్యా వైజాగ్ టూ విజయనగరం అప్ అండ్ డౌన్ చేసే రమణమూర్తికి ఆ రోజు ఉదయం బస్సు అంత రద్దీగా ఉండడం సుతరామూ నచ్చలేదు. రోజూ అయితే ఖాళీగా ఉన్న సీట్లో జాలీగా కూర్చుని కాసేపు వారపత్రిక తిరగేసి మరికాసేపు దర్జాగా కునుకు తీసి, విజయనగరం రాగానే ఫ్రెష్‌గా ఫీలవుతూ బస్సు దిగి బ్యాంక్‌కి వెళ్లేవాడు తను. అలాంటిది ఇవాళ కమ్మీ పట్టుకుని కోతిలా తైతక్కలాడాల్సొస్తోంది.**

# సెల్‌ఫోన్ ఎక్కడున్నాదీ...

పెళ్లి ముహూర్తాలో పెడాకుల ముహూర్తాలో ఉన్నట్టున్నాయ్ ఈవేళ! జేబులో చెయ్యి పెట్టి పర్సుతీద్దామన్నా చెయ్యి పక్కవాడి జేబులోకి దూరిపోతుందేమో ననిపించేంత తొడతొక్కిడి.... బస్సు శబ్దాలూ, పిల్లల ఏడుపులూ చాలవన్నట్టు అడపాదడపా మోగే సెల్‌ఫోన్ల రింగ్ టోన్లూ, ''ఆ! చెప్పు...'' అంటూ జనాల అరుపుల్లాంటి సంభాషణలూ చిరాకెత్తిస్తున్నాయి మూర్తికి.

పద్మవ్యూహాన్ని ఛేదిస్తున్న అభిమన్యుడిలా జనసంద్రంలో ఈతకొడుతూ మూర్తిని సమీపించేడు కండక్టర్.

''విజయనగరం'' క్లుప్తంగా అన్నాడు మూర్తి కష్టపడి జేబులోంచి పర్సుతీస్తూ.

''ఇరవై వేలివ్వండి!'' నిక్కచ్చిగా అన్నాడు కండక్టర్.

పొద్దున్నే ఇదేం పరాచికం? అనుకుంటూ ''క్యాట్ కార్డ్. విజయనగరం. ఒకటే టిక్కెట్టు'' నేనేం బస్ అంతా కొంటాననడం లేదన్న భావాన్ని మూడు ముక్కల్లో ఇరికించి పర్సులోంచి ఓ ఏభై నోటూ, క్యాట్‌కార్డ్ బైటికి లాగేడు మూర్తి.

''అయితే పద్దెనిమిది వేలు. ఇదే ఆఖరి మాట.

**అంతే! మూర్తి నోట్లోంచి మాటలేదు. నిలబడే శక్తి లేదు. కళ్ల ముందు సప్తర్షి మండలం స్పష్టంగా అవుపిస్తుండగా ధబ్బుమంటూ కార్పెట్ మీద పడి లుంగలు చుట్టుకుపోయేడు నొప్పితో.**

బేరాలొద్దు. నాకసలే టైం లేదు'' సీరియస్‌గా అనేశాడు కండక్టర్.

హతాశుడయ్యేడు మూర్తి. ''ఆర్టీసీ చార్జీలు పెరగనున్నాయ్'' అని మొన్న పేపర్లో చూసిన గుర్తు. అయితే! ఎంత నష్టాల్లో ఉంటే మాత్రం ఇంత ఘోరంగా పెంచేయడమా? నిన్న ఆదివారం కదా అని రోజులో చాలా భాగం నిద్దట్లోనే గడిపేశాడు మూర్తి. ఇప్పుడు డౌటొస్తోంది. అదేదో గలివర్ ట్రావెల్స్ కథలా తను ఓ పాతికేళ్లు నిద్దరోలేదు కదా! ఇది రెండు వేల ఆరేనా? పక్కనే పేపర్ చదువుతున్న పెద్దమనిషి మీదుగా ఒంగి పేపర్లో డేటు చూసేడు మూర్తి. ఇది అక్టోబర్ నెలే! రెండు వేల ఆరే! మరి ఈ వింతేంటి? విజయనగరానికి టిక్కెట్ ఇరవై వేలా? క్యాట్‌కార్డ్ ఉంటే పద్దెనిమిది వేలా? మైగాడోయ్! అసలిది బస్సా? ఎయిర్ బస్సా? ఆ డౌట్ రాగానే ఒడిస్సీ కళాకారుడి టైపులో శరీరాన్ని లంబకోణంలో వొంచి, కిటికీ పక్కన కూర్చున్న కుర్రాడి మీదుగా ఒంగి కిటికీలోంచి బుర్రెట్టి కిందికి చూసేడు మూర్తి. అమ్మయ్య! ఇది రోడ్డు మీద నడిచే మామూలు బస్సే. మరేవిటీ రేట్లు? అంతలో డ్రైవర్ సీట్లోంచి కయ్‌మంటూ కేకలు. ''ఎవడ్రా కిటికీలోంచి బుర్ర బైటికెక్కిన బర్రలేని నా.... బుర్ర చిదికిపోగల్దు కోడిగుడ్డు నాగ!'' తన వాడుకభాషలో కస్సుబుస్సుమన్నాడు బస్సు డ్రైవర్. ఠపీమని బుర్రని లోపలకి లాగేస్కున్నాడు మూర్తి.

''అంత బుర్ర లేని నా.. నే అయితే నేను కిటికీలోంచి బైటికి పెట్టిందేంటట? నువు తిట్టింది దేనికట!'' అంటూ గట్టిగా ఇచ్చేద్దామనుకున్నాడు గానీ బుర్ర లేని వాడితో ఎందుకులే అని ఊరుకున్నాడు.

''ఏటీ? డబ్బులు చేతిలో పట్టుకుని దిక్కులు చూస్తున్నారు? ఇవ్వాలనిపించడం లేదా?'' ఎకసెక్కంగా అంటూ చేతిలోంచి నోటు లాక్కుని టిక్కెట్టూ, చిల్లరా ఇచ్చేడు కండక్టర్. ''ఇరవై వేలంటుంటేనూ!'' నసిగేడు రమణమూర్తి రిలీఫ్ ఫీలవుతూనే.

''భలేటోరే!'' పగలబడి నవ్వుతూ జోకుని ఎంజాయ్ చేస్తూ అతగాడు తలాడిస్తుంటే అప్పుడు కనబడింది అతని చెవి వెనకాల బ్లూటూత్ లాంటి ఏదో పరికరం. దాని సాయంతో చేతిలో సెల్ పట్టుకోకుండానే మాట్లాడొచ్చు.

''నా హీరో హోండా అమ్మకానికెట్టేన్లెండి. ఆడెవడో సరిగ్గా ఈ బిజీ టైంలోనే ఫోన్ చేసి బేరం మొదలెట్టేడు!'' చెప్పుకుపోతున్నాడు కండక్టర్.

'ఈ మోడ్రన్ టెక్నాలజీ మనిషిని ఎంత బురిడీ కొట్టించగలదు?' కదిలే బస్సులో కమ్మీతో కథాకళి ఆడ్తూనే ఆశ్చర్యపోయేడు మూర్తి.

అతని ఒంటికాలి తపస్సు ఫలించినట్టు, బస్ విజయనగరం చేరుకుంది. ఎప్పుడూ లేంది ఆ రోజు అరగంట ముందుగానే ఊరు చేరుకున్నాడు మూర్తి. దానికీ కారణం ఉంది. పొద్దున్నే చెట్నీలో ఉప్పు ఎక్కువైందని శ్రీమతితో చిన్న గొడవ పెట్టుకుని, తినకుండా అలిగి కోపంగా బస్టాప్‌కి లగెత్తడం వల్ల మిగిలిన టైమది. ఆకలి దంచేస్తోంది. ఎదురుగా హోటల్ మేనక.

నకనకలాడే కడుపుతో హోటల్‌లోకి ప్రవేశించాడు మూర్తి. విశాలంగా ఉన్న ఓ డబల్ సీటర్ సోఫాలో విలాసంగా జేరగిలబడి కూర్చుని సాంబారిడ్లీ, డబల్ రోస్ట్ దోశె, ముక్తాయింపుగా కాఫీ కానిచ్చేక శ్రీమతి మీద కోపం కాస్త చల్లారినట్టనిపించింది ఆకలితో బాటు. బిల్లు చెల్లించి రోడ్డుమీదికొచ్చేడు నిండుగర్భిణిలా. ఇప్పుడిక బ్యాంక్ దాకా నడవాలంటే భుక్తాయాసంగా ఉంది.

ఆశగా బెల్లు కొట్టుకుంటూ వచ్చిన రిక్షావాలాతో ''ఆంధ్రా బ్యాంక్ వెళ్లాలి. ఎంత?'' అన్నాడు మూర్తి.

''ఆర్రూపాయిలివ్వండి బాబూ!'' వినయంగా అర్థించేడు రిక్షావాలా.

''అబ్బే! ఇక్కడేగా! నాలుగు రూపాయలిస్తా. కాదంటే నడిచే పోతాలే'' బెదిరించాడు మూర్తి. హోటల్‌లో దుబారా చేసిన డబ్బు ఇక్కడైనా ఆదా చెయ్యాలిగా.

''బోణీ బేరమే బోడిబేరం తగిలింది'' సణుక్కుంటూ తొక్కడం మొదలెట్టాడు రిక్షావాలా.

రిక్షా బ్యాంకుకి చేరింది. బ్యాంక్ అంతా ప్రశాంతంగా ఉంది. ఇంకా బాస్ రాలేదు. తొందరగా వచ్చిన కొందరు స్టాఫ్ సరదాగా జోకులేసుకుంటూ సీట్లోనే సెటిలవుతున్నారు. క్యాషియర్ కమలిని ఓ మూల అద్దం ముందు నిలబడి పైటా గట్రా సవరించుకుంటోంది. ఆమె పైటకేసే చూస్తూ తన సీట్లో సెటిలైన మూర్తికి ఎందుకో శ్రీమతి గుర్తొచ్చింది. 'పొద్దున్న అనవసరంగా పోట్లాటయిపోయింది. ఒక్కసారి ఫోన్ చేసి సారీ చెప్పి సరసమాడితే సరి! ఒక్కగానొక్క పెళ్లాం కదా! ఏమిటో ఎదురుగా ఉన్నప్పుడు పోట్లాడ బుద్ధి, దూరం కాగానే మాట్లాడబుద్ధి! ఈ వీక్‌నెస్ కనిపెట్టే కదా వన్ ప్లస్ వన్ ఆఫర్లిచ్చి మరీ సెల్ ఫోన్లు కొనిపించి సెల్ కంపెనీల వాళ్లు బాగుపడిపోతున్నారు- అనుకుంటే తన సెల్ కోసం యధాలాపంగా జేబు తడుముకున్నాడు మూర్తి. సెల్ లేదు! బట్టల్లో బొద్దింక దూరినవాడిలా, బార్‌లో డిస్కోడ్యాన్సర్‌లా జర్కీ మూమెంట్స్ ఇస్తూ షర్ట్‌కీ, ప్యాంట్‌కీ ముందూ వెనకా ఇరుపక్కల తోడై ఉన్న జేబులన్నీ తిరగేసి మరీ గాలించేడు మూర్తి. డౌట్ లేదు. సెల్ ఈజ్ నో మోర్. ఐదువేలిచ్చి కొన్న కెమేరా సెల్! అయ్యో! ఎక్కడ పోయి ఉంటుంది? బస్‌లోనా? నో ఛాన్స్. ప్రయాణాల్లో తను చాలా జాగ్రత్తగా ఉంటాడు.

మరి! రిక్షాలో పడిపోయిందా? ఆ డౌట్ రాగానే ఆంజనేయుడిలా బ్యాంకు లోంచి బైటికి ఉరికేడు మూర్తి. అదృష్టవశాత్తు రిక్షావాలా అక్కడే ఉన్నాడు. అంటే సెల్ అతనికి దొరకలేదనేగా! అయినా అడిగేడు ఎందుకైనా మంచిదని.

''అయ్యోపాపం! చెల్లు పోనాదా? సూస్కోండి నా రిచ్చాలో ఏటీ పడనేదు. పాపం! రూపాయి డబ్బులికే గీసిగీసి బేరాలాడే మారాజుకెంత కట్టమొచ్చినాది!'' అది జాలో సెటైరో అర్థం కాలేదు. అర్థమయ్యేంత టైమూ లేదు మూర్తికి.

''సర్లె గానీ మళ్లీ మేనకాకి వెళ్లాలి. వస్తావా! అక్కడ టిఫిన్ చేసిన సోఫాలోనే పడిపోయి ఉంటుంది'' రిక్షా ఎక్కుతూ అన్నాడు మూర్తి.

''పది రూపాయలు బాబూ!'' ఇవ్వగలవా అన్నట్టు చూస్తూ అన్నాడు రిక్షావాలా. చుట్టుపక్కల వేరే రిక్షాల్లేకపోవడం, తన తొందరా అన్నిటినీ 'ఎన్‌క్యాష్' చేస్కుంటున్నాడన్నమాట! పళ్లు పటపటలాడిస్తూ రిక్షా ఎక్కేడు బుర్రాడిస్తూ.


పాపం! శ్రీమతి ఎప్పుడూ అడుగుతుంటుంది తనకీ ఓ సెల్ కొనమని! నీకు అన్నీ పోగొట్టడం అలవాటంటూ తనే కొనలేదు. ఇప్పుడు ఈ సంగతి తెలిస్తే ఊరుకుంటుందా? ఏకి పారెయ్యదూ! ఆ మాటకొస్తే తను మాత్రం సెల్ ఉండి ఏం స్వర్గసుఖాలనుభవించేడనీ! సెల్ చేతిలో ఉంటే తన పిలక శ్రీమతి చేతిలో ఉన్నట్టే. 'ఎక్కడున్నావ్? ఏం చేస్తున్నావ్? ఇందాకెందుకు ఎత్తలేదు?' అంటూ ఆరాలు తీస్తుంది. కరేపాకు తెమ్మనో చెట్నీ పప్పు తెమ్మనో ఆర్డర్ వేస్తుంది. బయల్దేరే ముందరే చెప్పొచ్చుగా. కరేపాకు కోసం కాలు వేస్తా అని కూకలేద్దామంటే దానికీ బిల్ వేస్తవుతుందని నోరు మూస్కోవాల్సిందే. అసలు ఇంట్లో పెళ్లాంలా ల్యాండ్ లైన్ ఉండగా ప్రియురాల్లా ఈ మొబైల్ ఎందుకో తనలాంటి వాడికి? ఎప్పుడు ఎవడు లేపుకుపోతాడో అని ఎప్పుడూ టెన్షనే! చివరికి అదే జరిగింది!

మనం అవసరం కొద్దీ ఎవరికైనా చేస్తే రూట్స్ బిజీ అనో, ఆప్ క్యూమేహై! అనో అంటుంది. వాడి అవసరం కొద్దీ ఎవడైనా మనకి చేస్తే, రాంగ్ నెంబర్‌గాడైనా సరే, ఠంచనుగా మోగేస్తుంది. ఆమధ్య అలాగే! అర్జెంటు పని మీద టూ వీలర్ మీద వెళ్తుంటే బ్యాండ్ బాజాలా జేబులో మోగేస్తుంది సెల్. ఎవరో ఎందుకో అని గాభరా పడి ఓ చేత్తో డ్రైవింగ్ చేస్తూనే మరో చేత్తో సెల్ ఆన్ చేసి చెవికీ మెడకీ మధ్య సెల్ ఇరికించి, వంకర మెడవాడి మాదిరి మాట్లాడ్తుంటే ''హాయ్ శైలూ! సాయంత్రం శివాజీపార్క్‌కెళ్దాం వస్తావా?'' అంటూ ఎవడో రాంగ్ నెంబర్ రోమియో!

''నేను శైలూని కాదురా బాబూ! అసలు సిసలు మగాణ్ణి! నా పేరు మూర్తి!'' అంటే వినడే.

''నువ్వు మిమిక్రీ ఆర్టిస్ట్‌వని నాకు తెలుసు లేమ్మా! మగ వాయిస్‌లు కూడా ప్రాక్టీస్ చేస్తున్నావా?'' అంటూ ఎకసెక్కాలు! పైగా పార్కులో తను నాతో ఏ సరసం ఏ విధంగా ఆడదల్చుకున్నాడో వివరించేస్తున్నాడు నేను సిగ్గులమొగ్గనైపోవాలి! 'ఓర్నీ జిమ్మడ' అనుకుంటూ ఫోన్ కట్ చేసి జేబులో కుక్కేంతలో ఎదురుగా అడ్డంగా లాఠీ ఊపుతూ యమదూతలా పోలీస్ మావ! డ్రైవింగ్ చేస్తూ సెల్‌లో మాట్లాడేనంటూ ఐదొందలు ఫైన్ వడ్డించాడు రాంగ్‌నెంబరయ్యా బాబూ అంటే వినకుండా.

నిన్నయితే గొయ్యి తీసి సెల్లుని అందులో పూడ్చెయ్యాలన్నంత కోపం వచ్చింది. అర్థరాత్రి.. అర్ధాంగిని బతిమిలాడుకుని ఏదో కాస్త కాపరం వెలగబెడుతుంటే వరసగా మూడు మెసేజ్ ఎలర్ట్ టోన్‌లు! ఆ గోలకి అసలే వచ్చేపోయే ఆవిడ మూడు కాస్తా చెడిపోయి విసుగ్గా మొహం పెట్టి మూడంకె వేసుకుపడుకున్నాక చేసేదేం లేక మెసేజ్



ఏంటా అని చూస్తే.. కరిష్మాకపూర్‌కి కొడుకా? కూతురా? కరెక్ట్ ఆన్సర్ ఎస్ఎమ్ఎస్ చేసిన లక్కీ విన్నర్‌కి హోండా సిటీ కారు బహుమతి. లక్షల మందిలో ఆ ఛాన్స్ నాకే దక్కేస్తుందని సంబరపడిపోయి ఆ అర్ధరాత్రి పూటా పెళ్లాన్ని మానేసి సెల్ నొక్కుకుంటూ కూర్చోవాలన్నమాట! కాపరాలు కూల్చడానికి కాకపోతే ఎందుకట ఈ సెల్‌ఫోన్లు!

ఇలా సెల్ వ్యతిరేక భావాలు స్టోర్‌రూంలో ఎలకల్లా మెదడు నిండా గజిబిజీగా పరిగెడ్తుండగా హోటల్ మేనక వచ్చేసింది. రిక్షా దిగుతూనే ఇందాక తను కూర్చున్న సోఫాకేసి లగెత్తేడు మూర్తి.

ఆ సీట్‌లో.. దాదాపు ఆరడుగుల పొడుగున్న మోడ్రన్ మేనకలాంటి ఓ అందాల భామ.. టీ షర్టూ, మినీస్కర్టుల్లో మిసమిసలాడిపోతూ తన పక్కనే కూర్చున్న చుడీదార్ అమ్మాయితో హిందీలో మాట్లాడేస్తోంది. ఆమె వయ్యారం చూసి అంత టెన్షన్‌లోనూ మూర్తి గుండె బీటు మార్చి పోటు పెట్టింది. స్లిమ్‌గా స్లీక్‌గా ఉండే తన సెల్, లాంగ్‌గా లవ్‌లీగా ఉన్న ఆ నార్త్ ఇండియన్ అమ్మాయి స్కర్ట్ కింద మెత్తగా నలుగుతూ ఉండి ఉంటుందన్న ఊహే గుండెని పిండేస్తుండగా 'సెల్లునైనా కాకపోతిని' అనుకున్నాడు ఒక్క క్షణం. మరు క్షణం శ్రీమతిని గుర్తు తెచ్చుకుని బలవంతంగా మూడాఫ్ చేసుకున్నాడు మూర్తి.

ఆమె ఎప్పుడు లేస్తుందా తన సెల్ ఆమె సీటు కింద నించి ఎప్పుడు తీసుకుందామా అన్న ఆత్రంతో అనిమేషుడిలా అటే చూస్తున్నాడు మూర్తి. ఆ చూపుల్ని మరోలా అర్థం చేస్కుందేమో మూర్తికేసి కోరగా చూస్తూ పక్కనున్న చుడీదార్‌తో ఏదో అంది. ఆ హిందీ అర్థంకాలేదు గానీ సెల్ అన్నమాట రెండుసార్లు వినబడి ఆనందంతో పులకించిపోయేడు మూర్తి. 'తన సెల్ ఆమెకి దొరికిందన్నమాట! దాని గురించే మాట్లాడ్తోంది! ఇకనేం! అడిగేస్తే సరి!' ఎలా? తనకి హిందీ సరిగ్గా రాదుగా! రాకపోతేనేం? బ్రోకెన్ హిందీ, స్పోకెన్ ఇంగ్లీష్ కలిపి కొడ్తే సరి! అనుకుంటూ గొంతు సవరించుకున్నాడు సంబరంగా.

''ఎక్స్‌క్యూజ్‌మీ మేడం.. మేరా సెల్.. ఆప్‌కీ స్కర్ట్‌కే.. అందర్.. హైనా'' హిందీలో విభక్తులు తనకెప్పుడూ డౌటే! ఆ విషయంలో చిన్నప్పుడు హిందీ టీచర్‌తో తన్నులు కూడా తిన్నట్టు గుర్తు.

ఆ మాటలు వింటూనే ఆమె కళ్లు కోపంతో జేవురించేయి. మరు సెకన్లో ఆడ ఉరుములా గర్జిస్తూ మెరుపులాంటి వేగంతో పిడుగులా అతనికి రెండే రెండు అంగుళాల దూరంలో నిలబడింది. తత్తరపడి తనూ నిలబడ్డాడు మూర్తి.

''మేరీ స్కర్ట్ కే అందర్ క్యారే!'' అంటూ మూర్తి షర్ట్ కాలర్‌ని ఓ చేత్తో ఒడిసిపట్టుకుంది మెడతో సహా. ఆ పట్టు ఉడుంపట్టై గిలగిలా కొట్టుకుంటూ పీలగా అన్నాడు మూర్తి. ''అందర్ నహీ.. నీచే.. నీచే..'' విభక్తి మార్చేడు భక్తీ, భయమూ ముప్పిరిగొనగా.

''నీచే క్యారే నీచ్ కమీనే..'' అంటూ పిడికిలి బిగించి రెండో చేత్తో మూర్తి కడుపులో పిడిగుద్దులు కురిపించిందా పంజాబీ లేడీ.

అంతే! మూర్తి నోట్లోంచి మాటలేదు. నిలబడే శక్తి లేదు. కళ్ల ముందు సప్తర్షి మండలం స్పష్టంగా అవుపిస్తుండగా ధబ్బుమంటూ కార్పెట్ మీద పడి ఉంగులు చుట్టుకుపోయేడు నొప్పితో.

''సెల్ చాహియే ఉస్‌కో.. దేదోనా..'' ఆమె మాటలు లీలగా వినబడుతుండగా బట్టలమూటలా బరబరా లాక్కెళ్ళబడి రెస్టారెంట్ బయటే ఉన్న పోలీస్ వ్యాన్‌లోకి తోయబడ్డాడు మూర్తి.

''ఆవిడగారు మఫ్టీలో ఉన్న డియస్‌పీ అని తెలీక అలవాటుగా ఈవ్‌టీజింగ్ చేస్తూ మేమంటే తప్పులో కాలేశామే అనుకోండి. మీరు కూడా ఏంటంకుల్ ఈ వయసులో..'' వెకిలిగా నవ్వేడు వ్యాన్‌లో అప్పటికే రెడీగా ఉన్న పోకిరీ కుర్రాళ్ల బ్యాచ్‌లో ఒకడు. వాడి దగ్గర తన పాతివ్రత్యాన్ని నిరూపించుకునే ఓపిక లేక కిమ్మన్లేదు మూర్తి. అంతలో చుడీదార్ అమ్మాయితో సహా డియస్పీ కౌర్ విసవిసా నడుచుకుంటూ వొచ్చి వ్యాన్‌లో కూర్చుని స్టార్ట్ చేసింది. ఆమె పక్కనే చుడీదార్‌తో కూర్చున్న ఆ కానిస్టేబులికి తెలుగొచ్చని అర్థమైంది మూర్తికి.

''అమ్మా.. అసలూ...నేనొచ్చింది సెల్ గురించి..'' నీర్సంగా వివరించబోయేడు మూర్తి వ్యాన్ మెష్‌లోంచి ముందుకి వంగుతూ.

''నిన్ను చూడగానే మేడం కూడా అదే అన్నారు. వీణ్ణి వీడి చూపుల్ని చూస్తుంటే సెల్‌లో వేసి చితకబాదాలని ఉందని! దానికి తోడు డైలాగ్స్ కూడా కొట్టేవుగా హిందీలో! నీకు స్పెషల్ సెల్ ఇస్తాం. డోంట్ వర్రీ!'' లేడీ విలన్‌లా నవ్విందామె.

ఇందాక ఆవిడగారు సెల్...సెల్... అంటూ మాట్లాడింది ఈ సెల్ గురించా.. మైగాడోయ్! భారంగా నిట్టూర్చాడు మూర్తి. ఒక్కరోజు సెల్‌లో ఉంటే ఉద్యోగం లోంచి సస్పెండ్ చేస్తార్ట. ఎప్పుడో విన్నట్టు గుర్తు. ఇప్పుడెలా? హే భగవాన్! కౌర్‌గారికి అసలు విషయం చెప్పుకుని ప్రాధేయపడదాం అంటే లాంగ్వేజ్ ప్రాబ్లమ్! ఊరుకుందామంటే 'సెల్' ప్రాబ్లం! పోనీ జీప్‌లోంచి దూకేస్తే? మోకాళ్లు బద్దలవ్వడం తప్ప పెద్ద ప్రయోజనం ఉండదు. భగవంతుడా ఎలాగేనా కాపాడవయ్యా! మనసులోనే దీనంగా ప్రార్థించేడు మూర్తి.

వ్యాన్ క్రీచ్‌మంటూ పోలీస్ స్టేషన్ ముందర ఆగింది.

అందర్లోకీ ఆఖరివాడుగా దిగేడు మూర్తి. 'లావొక్కింతయు లేదు' పద్యం గుర్తు తెచ్చుకుని మరీ పాడుకుంటూ స్టేషన్‌లోకి నడవబోయేడు.

అంతలో.. మూషికం మీద వినాయకుడిలా నింపాదిగా బజాజ్ చేతక్ మీద వస్తున్న ఆ శాల్తీని చూడగానే కోటి రూపాయల లాటరీ తగిలినట్టు ఆనందంతో కేరింతలు కొట్టేడు. నడిరోడ్డుమీద నడ్డి విరిగేలా ఆ స్కూటర్ ముందు పల్టీలు కొట్టేడు. ఆ శాల్తీ ఎవరో కాదు. మూర్తి బాల్యమిత్రుడు లాయర్ దామోదర్. విజయనగరంలోనేలా ప్రాక్టీస్ చేస్తున్నాడు.

అనుకోకుండా అడ్డొచ్చిన ఆగంతకుణ్ణి అడ్డమైన బూతులూ తిట్టబోయి అంతలో గుర్తుపట్టి బండికీ, బూతులకీ ఒకేసారి బ్రేక్స్ వేసేడు దామోదర్.

''ఒరే! మూర్తీ! నువ్వేంట్రా పోలీసు జీపులోంచి దిగుతున్నావ్? బ్యాంకులో డబ్బులేమైనా నొక్కేసేవా? అలాంటోడివి కాదే!'' ఆందోళనగా అడిగేడు.లాయర్ దామోదర్‌ని చూస్తూనే హెడ్ వీరయ్య సెల్యూట్ బాదడంతో కొండంత ధైర్యం వచ్చింది రమణమూర్తికి. దామోదర్‌తో బాటు స్టేషన్‌లోకి నడుస్తూనే జరిగిందంతా ఫాస్ట్ ఫార్వర్డ్‌లో చెప్పి భోరుమన్నాడు మూర్తి.

''డియస్‌పీగారు అప్పుడప్పుడు కోర్టుకొస్తుంటారు. నాకు పరిచయమేననుకో! అయినా అలా ఎలా వాగేవురా ఆవిడతో!'' అంటూ విసుక్కుంటూనే అల్లరి పిల్లాణ్ణి క్లాస్‌టీచర్‌కి సారీ చెప్పించడానికి తీస్కెళ్లినట్టు మూర్తిని రెక్కపుచ్చుకుని కౌర్ గారి గదికి తీసుకెళ్లాడు దామోదర్.

దామోదర్‌ని చూసి ఫ్రెండ్లీగా నవ్విన డియస్‌పీ కౌర్, మూర్తిని చూస్తూ అగ్గిమీద గుగ్గిలం అవబోయింది మరోసారి.

రమణమూర్తి తన చిన్నప్పటి క్లాస్‌మేట్ అనీ, వొట్టి వెర్రిబాగుల రకం అనీ, ఏదో సెల్ పోగొట్టుకున్న ఖంగార్లో వచ్చీరాని హిందీలో ఏదో వాగేడు తప్ప దురుద్దేశాలేం లేనివాడనీ స్వచ్ఛమైన హిందీలో ఆమెకి వివరించాడు దామోదర్. మూర్తి కూడా ముకాభినయంతో వంతపాడుతూ ఆంగికాభినయంతో శతకోటి అపాలజీలు చెప్పి బతుకుజీవుడా అని బైటపడ్డాడు.

అప్పటికే లంచ్ టైం కూడా దాటిపోవడంతో దామోదర్ సలహా మీద బ్యాంక్‌కి 'సిక్' అని టెలిగ్రాం కొట్టి, స్నేహితుడికి సలాంలు కొట్టి, తిరుగుబస్సులో వైజాగ్ చేరేడు. ఇల్లు చేరగానే కనబడిన దృశ్యానికి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు మూర్తికి. తన సెల్‌తో గేమ్స్ ఆడుకుంటున్నాడు పుత్రరత్నం మున్నా.

''సెల్ మర్చిపోయి వెళ్లేరు. ఏమీ ఇబ్బందవ్వలేదు కదా!'' మంచినీళ్ల గ్లాస్ అందిస్తూ అంది శ్రీవతి.

''గ్లాసుడు చాలవు. జగ్గునిండా ఇవ్వు'' తన మతిమరుపు నిర్వాకం చెప్పుకోడానికి తనకే సిగ్గేసి టాపిక్ మార్చేడు మూర్తి!